పేలిన 108 అంబులెన్స్ టైర్



ఆగిన అంబులెన్స్‌లో వెంటిలేటర్ మీద ఉన్న బిల్ల బక్కన్న



టైరు పేలడంతో బండి ఆత్మకూరు వద్ద ఆగిపోయిన 108 వాహనం

- వెంటిలేటర్‌పైనే వృద్ధుడు.. గంట సేపు ఎదురుచూపులు
- ఆందోళనకు గురైన బంధువులు

బండి ఆత్మకూరు : ప్రాణాపాయస్థితిలో ఉన్న వృద్ధుడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో 108 అంబులెన్స్ టైరు పేలి గంటల కొద్దీ రోడ్డు మీద నిరీక్షించాల్సిన పరిస్థితి మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. వెలుగోడు మండలం బోయరేవుల గ్రామానికి చెందిన బిల్లా బక్కన్న అనే వృద్ధుడు తీవ్ర అనారోగ్యంతో వెలుగోడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఈ క్రమంలో బండి ఆత్మకూరు సమీపంలోకి రాగానే వాహనం వెనక టైరు పేలడంతో అంబులెన్స్ ఆగిపోయింది. దీంతో వెంటిలేటర్‌పై ఉన్న వృద్ధుడి పరిస్థితి ఆందోళన కలిగించింది. సిబ్బంది ఆయనకు చికిత్స కొనసాగిస్తూ మరో వాహనం కోసం సమాచారం అందించారు. గంట లోపు మరో అంబులెన్స్ రావడంతో వృద్ధుడిని అందులోకి ఎక్కించి నంద్యాలకు తరలించారు. 108 వాహనాల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని బాధితుడి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజనంలో గుడ్డు ఎందుకు ఇవ్వలేదు?



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

పాములపాడు: మధ్యాహ్నం పోయిన పథకంలో విద్యార్థులకు గుడ్డు ఎందుకు ఇవ్వలేదని జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నాగరాజు ప్రశ్నించారు. బుధవారం మండలంలోని మిట్టకిందల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సన్న బియ్యం కాకుండా లావు బియ్యంతోనే విద్యార్థులకు భోజనం వండడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్‌లో ఒకటి నుంచి పదో తరగతి వరకు మొత్తం 280 మంది పిల్లలు ఉండగా.. బుధవారం 206 మంది పిల్లల హాజరయ్యారని, మెనూ ప్రకారం తెల్లన్నం, సాంబారు, చిక్కి, గుడ్డు , ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే గుడ్లు సరఫరా లేకపోవడంతో ఇవ్వలేదని ఉపాధ్యాయులు తెలిపారు. అయితే స్టోర్ అన్నం వండినందుకు అన్నం చితికిపోయి సాంబారు నాణ్యత లేదని ఆయన అన్నారు. సన్న బియ్యం ఎందుకు ఒండలేదని అడగగా టీచర్ సుబ్బయ్య ఇంతకుముందు ఇచ్చినటువంటి బియ్యం అయిపోయిన తర్వాత సన్న బియ్యం వాడాలని జిల్లా పై అధికారుల ఆదేశాలున్నట్లు సమాదాన మిచ్చారు. ఈ విషయాలపై జిల్లా కలెక్టర్‌కు వివరిస్తానని నాగరాజు తెలిపారు.

యువతి అదృశ్యం

బండి ఆత్మకూరు : మండలంలోని జీసీ పాలెం గ్రామానికి చెందిన నీలి వినోదిని అనే యువతి అదృశ్యమైందని ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. వివరాలు.. మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారని, ఆమె తమ్ముడు నీలి మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ వెల్లడించారు.

రేపు తుమ్మలూరులో పశువైద్య శిబిరం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న పశు వైద్య శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక పశు వైద్యశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు.

విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి

మహానంది: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మానసికంగా దృఢంగా ఉండాలని నంద్యాల జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు సునీత, ఈశ్వర ప్రసాద్ తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలల్లో బుధవారం అవగాహన కార్యక్రమంతో పాటు విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల దృక్పథం అలవరుచుకోవాలని చెప్పారు. ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ధ్యానం, యోగా సాధన చేస్తూ శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు ప్రయత్నం చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర ప్రకటించాలి

నందికొట్కూరు: ఖరీఫ్ సీజన్లో రైతులు అతివృష్టి, అనావృష్టి తట్టుకొని మొక్కజొన్న పంటను అధిక ఖర్చులతో పండించారని, వచ్చిన దిగుబడికి గిట్టుబాటు ధర ప్రకటించాలని రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు చెరుకుచెర్ల గాబ్రియేల్ డిమాండ్ చేశారు. అలాగే మార్క్‌ఫెడ్ ద్వారా మండల కేంద్రాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని పగిడ్యాల రోడ్డు సమీపంలో మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో అధికవర్షాల వల్ల దిగుబడి తక్కువగా వచ్చిందన్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2400 ప్రకటించిందని, అయితే వ్యాపారులు దళారులు ఇప్పటికే కుమ్మక్కై రూ.2000 రూపాయలకే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. తక్కువ ధర కొనుగోలు చేస్తున్న వ్యాపారస్తులపైన తక్షణమే ప్రభుత్వం చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ మండల కార్యదర్శి కాటేపోగు స్వామన్న, రైతు నాయకులు గుజ్జుల కృష్ణ, తిక్క స్వామి, రైతులు పాల్గొన్నారు.

అభ్యాసకులూ.. ఒత్తిడికి లోనవ్వొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రమీల

పగిడ్యాల: విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా ఉండటం అలవర్చుకోవాలని జిల్లా కెరియర్ మరియు మెంటల్ హెల్త్‌కౌన్సిలర్స్ ప్రమీల, నాగన్న అన్నారు. బుధవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మోడల్, కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఒత్తిడిని ఎలా జయించాలనే విషయమై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా విద్యార్థులు నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో గంటపాటు యోగా చేయడం అలవర్చుకోవాలన్నారు. అలాగే డ్రాయింగ్ వేయటం, పోస్టర్లు తయారుచేయటం, మైండ్ రిలాక్స్ యాక్టివిటీస్ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ చిన్నమద్దిలేటి, ప్రిన్సిపాల్ రమేష్, ఎస్‌ఓ యశోద తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

ఆత్మకూరు: ఈనెల 10వ తేదీ నుంచి మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటీ దేవానందం బుధవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-14, 17 బాల,బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

నందికొట్కూరు: వైఎస్సార్ కడప జిల్లాలో ఆళ్లగడ్డ డిపోకు చెందిన హెయిర్ బస్సు డ్రైవర్ మహమ్మద్ రఫీపై దాడి చేసిన వారిపై వెంటనే అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు, సీఐటీయూ జిల్లా నాయకులు టి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ నాయకులు అంజిబాబు అధ్యక్షతన స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులను నిలిపి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం, బస్సుల సంఖ్య పెంచకపోవడంతో డ్రైవర్లకు, కండక్టర్లకు, రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతున్నాయన్నారు. అనంతరం ఎస్టీఐ షఫీ, ఎస్‌ఐ సురేష్ బాబుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బయ్య, రవి, నాగేషు, రాజు, శేషు గౌడు తదితరులు పాల్గొన్నారు,



బస్టాండులో ఆందోళన చేస్తున్న అద్దె బస్సుల కార్మికులు

అలరించిన సంప్రదాయ నృత్యం



సంప్రదాయ నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్ : శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై హైదరాబాదుకు చెందిన రాగరమ్య కల్చరల్ ఆర్గనైజేషన్ వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో మహా గణపతి, శివ శివ శంకరా, నమఃశివాయతే, భో.. శంభో తదితర గీతాలకు రాజ్యలక్ష్మి, సుకృతి, కల్పన, స్వర్ణలత, శ్రీదేవి, జమున, దివ్యశ్రీ, తేజ జ్ఞాన సహస్ర, శ్రీలక్ష్మి, అక్షర, రమ్య తదితరులు నృత్యం ప్రదర్శించారు.

రైతుల అవసరాల మేరకు యూరియా పంపిణీ



మనగ్రోమోర్ సెంటర్‌లో ఆన్‌లైన్ రిసిప్ట్‌లను తనిఖీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: రైతులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా యూరియా పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం సూచించారు. బుధవారం స్థానిక మనగ్రోమోర్ సెంటర్‌లో యూరియా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరిరైతుల అవసరాల మేరకు యూరియా తెప్పించామన్నారు. 11.98 టన్నుల యూరియాను సుమారు 250 మంది రైతులకు పంపిణీ చేశామన్నారు. ఇంకా రైతులకు అవసరం అయితే మరళ తెప్పిస్తామని చెప్పారు. అనంతరం యూరియా స్టాక్ రికార్డులు, పంపిణీ రిసిప్ట్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

ఆత్మకూరు: పట్టణంలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార సొసైటీ చైర్మన్ షాబుద్దీన్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎంత యూరియా కావాలో అంత సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రవీణ్‌కుమార్, అన్సర్, మున్నీర్, శీను, చంద్ర, భూపాల్‌రెడ్డి, సీఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీఎస్టీపై ఉపన్యాస పోటీలు

నందికొట్కూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ కే.రంగముని అధ్యక్షతన నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.రవి, ఆంగ్ల ఉపన్యాసకులు భాస్కర్, వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ బి.పరిమళా దేవి వ్యవహరించారు.

రైతాంగ సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

నందికొట్కూరు: రైతాంగా సమస్యల పరిష్కారం కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యం కావాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం. నాగేశ్వరావు పిలుపునిచ్చారు. బుధవారం నందికొట్కూరు జై కిసాన్ పార్కులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రెండో మహాసభలు బేస్తరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఎం. నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకుండా వ్యాపారస్తులకు, పెట్టుబడుదారులకు ఊడిగం చేస్తున్నాయని ఆరోపించారు. అనంతరం రైతు సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతు సంఘం గౌర అధ్యక్షుడిగా బేస్తరాజు, అధ్యక్షుడిగా కొణిదెల కేశారేస్, మల్యాల నుంచి కార్యదర్శిగా వి నాగరాజు, సహాయ కార్యదర్శి శివకృష్ణ, ఉపాధ్యక్షులుగా శివలింగం, కే రమణ సహకార్య దర్శిగా నాటూరు స్వాములు, కమిటీ సభ్యులుగా బిజినవేముల హుస్సేన్ మియా, బుడగ జంగం ధర్మయ్య, శేఖర్, స్వాములు, మా బాషా, తూర్పాటి శేఖర్, నరసింహలను ఎన్నుకున్నారు.

యువతా.. చెడుమార్గం పట్టొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ రామంజినాయక్

ఆత్మకూరు: యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంది.. లక్ష్యం చేరాలంటే క్రమశిక్షణతో మెలగాలని, తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా బాధ్యతగా నిర్వర్తిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్ పేర్కొన్నారు. స్థానిక థెరిస్సా కళాశాలలో బుధవారం జూనియర్ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువకులు నేడు వివిధ రకాల బైకులను వాడుతూ రోడ్డు భద్రతను మరిచిపోయారన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లల భవిష్యత్ ఉజ్వలంగా తీర్చిదిద్దేందుకు కష్టపడుతున్నారనేది గుర్తుంచుకోవాలని చెప్పారు. అలాగే మద్యం, మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సీఐలు సురేష్‌కుమార్‌రెడ్డి, రాములు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు.ప్రిన్సిపాల్ వసుంధర, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం కార్యవర్గ సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

నందికొట్కూరు: నంద్యాల పట్టణంలో ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు నంద్యాలలోని తేజస్విని హోటల్‌లో (రైతుబజార్ ఎదురుగా) వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు మార్కెట్ రాజు (పుల్లయ్య), 80 బన్నూరు సొసైటీ చైర్మన్, మాజీ సర్పంచ్ వై.వి. రమణ, పట్టణ ఎస్సీ అధ్యక్షుడు చరణ్ తెలిపారు. బుధవారం పట్టణంలో ఎస్సీ సెల్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమావేశానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్ బాబు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దారా సుధీర్ హాజరవుతారన్నారు. నందికొట్కూరు నియోజకవర్గ ఎస్సీ ప్రజాప్రతినిధులు, ఎస్సీ విభాగం మండల అధ్యక్షులు, గ్రామ ఎస్సీ నాయకులు తప్పక హాజరుకావలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు క్రిస్టియన్ మైనారిటీ నియోజకవర్గం అధ్యక్షుడు ల్యాబ్ రవి, పట్టణ ప్రధాన కార్యదర్శి కేశవ్, కార్యదర్శి కిషోర్, స్టూడెంట్ ప్రెసిడెంట్ శశాంక్, ఎలీషా, చంద్ర శేఖర్, జయన్న తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ ప్రయోజనాలపై అవగాహన



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుంకన్న

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుంకన్న, డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ద్వారా ప్రజలకు ఎంతమేర ఆర్థిక ప్రయోజనం చేకూరందనే అంశాలపై వివరించారు. జీఎస్టీ తగ్గింపు పాటించని వ్యాపారులపై టోల్ ఫ్రీ నంబర్ 18004252295కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. అధ్యాపకులు కేశవయ్య, జావీద్, సలీం, గరీబ్, సుజాత, నాగన్న, తిరుపతమ్మ, కృష్ణ, విద్యాసాగర్, నాగన్న పాల్గొన్నారు.

కొలనుభారతిలో 23 నుంచి నవ చండీ హోమం



అమ్మవారిని దర్శించుకున్న నాగేంద్ర స్వామి

కొత్తపల్లి: మండలంలోని కొలనుభారతి దేవి క్షేత్ర పరిధిలో ఈనెల 23 నుంచి నవ చండీ హోమం నిర్వహిస్తున్నట్లు అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమం పీఠాధిపతి శివానందలాహరి స్వామి శిష్యుడు నాగేంద్ర స్వామి తెలిపారు. బుధవారం ఆయన కొలనుభారతి దేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విశ్వమానవాళికి ముక్తిని అమ్మవారు ప్రసాదించాలన్న అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమ పీఠాధిపతి కోరిక మేరకు ఈ హోమం నిర్వహించాలనుకున్నామన్నారు. ఈనెల 23, 24 వ తేదీల్లో ఆలయ ప్రాంగణంలో నవ చండీహోమం చేస్తామన్నారు. ఆయన వెంట శిష్యబృందం మునిచక్రవర్తి, శివరామకృష్ణ ఉన్నారు.

నేడు హుండీ లెక్కింపు

కొలనుభారతి దేవి ఆలయ హుండీ ఆదాయం గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ రామలింగారెడ్డి బుధవారం తెలిపారు. గడిచిన నాలుగునెలలుగా హుండీలో భక్తులు వేసిన కానుకలు, వీరాశాలను లెక్కిస్తామన్నారు. ఆశక్తిగల భక్తులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి: వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని రుద్రవరం రేంజ్ అటవీశాఖాధికారి ముర్తుజావలి అన్నారు. బుధవారం చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వన్యప్రాణి వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తే వాటికి హాని తలపెట్టవద్దని, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు పంట పొలాల చుట్టూ విద్యుత్ తీగలు, ఉచ్చుల లాంటివి ఏర్పాటు చేయకుడదని సూచించారు. వన్య ప్రాణుల సంరక్షణపై నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డి.వనిపెంట సెక్షన్ అధికారి టి. రామకృష్ణ ఎఫ్‌ఎస్‌ఓలు శ్రీనివాసులరెడ్డి, రాణెమ్మ, మాబూఖాన్, ఎఫ్‌బీఓలు నాగ ఉశేనయ్య, మదన్‌గోపాల్, ఈ.సురేంద్రగౌడ్, జే. శుభాష్, వి. జేమ్స్‌పాల్, ప్రొటెక్షన్ వాచర్లు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అంటరానితనాన్ని నిర్మూలించాలి



మాట్లాడుతున్న యుగంధర్

మహానంది: హిందూ సమాజంలో నెలకొన్న అంటరానితనాన్ని నిర్మూలించాలని ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకారిణి సభ్యులు దువ్వూరి యుగంధర్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను మహానందిలో బుధవారం నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, నంద్యాల జిల్లా సంఘచాలక్ చిలుకూరి శ్రీనివాస్, మహానంది మండల ఖండ కార్యవాహ లక్కాకుల చిన్న కాశయ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ స్వదేశీ వస్తువులనే వాడాలని, పౌరవిధులు అందరూ పాటించాలని చెప్పారు.

ముగిసిన శిక్షణ తరగతులు

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులపాటు సర్పంచులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. గ్రామ పంచాయతీల్లో ఆదాయవనరులు ఏవిధంగా సమకూర్చుకోవాలో ట్రైనర్ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని తద్వారా ఆదాయ వనరులు సృష్టించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులుగా సొంత ఆదాయ వనరుల పెంపుపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఎంపీడీఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఆదాయ వనరులు ఎంతో అవసరమన్నారు. కావున గ్రామపంచాయతీకి సొంత ఆదాయ వనరుల సమకూర్చుకునేందుకు దృష్టి సారించాలన్నారు.

బండి ఆత్మకూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లకు ఇస్తున్న శిక్షణ బుధవారం ముగిసిందని పరిపాలన అధికారి జి.శ్యామల తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎంపీడీఓ గాయత్రి అధ్యక్షతన పంచాయితీల ఆదాయ వనరుల పెంపు, పన్ను వసూళ్ల పద్ధతులపై మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బందికి, సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చామని చెప్పారు.

జూపాడుబంగ్లా: పంచాయతీల పరిధిలోని వనరులను సద్వినియోగం చేసుకొని ఆదాయ వనరులను సృష్టించుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి, ట్రైనర్స్ పుల్లయ్య, లక్ష్మన్నస్వామి, శాలుబాషా అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సొంతంగా ఆదాయ వనరుల సృష్టిపై సర్పంచులు, సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి.

డ్రైవర్లపై దాడి సరికాదు



ఆత్మకూరు బస్టాండులో ధర్నా చేస్తున్న డ్రైవర్లు

ఆత్మకూరు: ఆళ్లగడ్డ అద్దె బస్సు డ్రైవర్‌పై కొందరు దాడి చేయడం సరికాదని ఆత్మకూరు అద్దె బస్సు డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు షాకీర్, మౌలాలి, జనార్ధన, సీఐటీయూ నాయకులు ఏసురత్నం, రామ్ నాయక్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అద్దె బస్సు యూనియన్ నాయకులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ హైర్ బస్సు డ్రైవర్లపై దాడులు చేయడం సరికాదన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా బస్సు ప్రయాణికులు అధికంగా ఎక్కడం వల్ల బస్సులు కొన్ని స్టేజిల్లో నిలపలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు నుంచి గౌడ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, రాముడు, సీఐటీయూ నాయకుడు రామ్‌నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం



తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యకరమైనవని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. బుధవారం మండలంలోని శివపురం గ్రామంలో పోషణ మహా వేడుకలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించామన్నారు. హ్యాండ్ వాష్ ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలు, ఐదు సంవత్సరాలలోపు పిల్లలు, 18 సంవత్సరాల లోపు కిశోర బాలికలు సరైన పోషకాహారం తీసుకోకపోవడం కలిగే నష్టాలు వివరించారు. కార్యక్రమానికి ఏఎన్ఎం సామమ్మ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మిదేవి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు బైక్ నడపడం నేరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మల్లికార్జున

జూపాడుబంగ్లా: మైనర్లు బైక్ నడపడం చట్టరీత్యానేరమని ఎస్ఐ మల్లికార్జున అన్నారు. బుధవారం జూపాడుబంగ్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోడ్డుభద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ 18ఏళ్ల పైబడి, లైసెన్స్ కలిగిన యువతీ, యువకులు మాత్రమే బైక్, కారు, ఆటోను నడపవచ్చునన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు బైకు ఇచ్చిన వారిపైకూడా చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షిగణపతి, వీరభద్రస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సాక్షి గణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీర భద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామి వారికి అభిషేకం, పుష్పార్చన జరిపించారు.

గోసంరక్షణ నిధికి విరాళం



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధి పథకానికి బుధవారం కర్ణాటక రాష్ట్రం సింధునూర్‌కు చెందిన కె.బృంద రూ.1,00,0111 విరాళాన్ని పర్యవేక్షకుడు కె.శివప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు దేవస్థానం తరఫున స్వామిఅమ్మవార్ల శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం, జ్ఞాపిక అందజేసి సత్కరించారు.

శ్రీశైలంలో కర్ణాటక వృద్ధుడు మృతి



మృతి చెందిన ప్రకాష్ గురవ్ (ఫైల్)

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని గోశాల సమీపంలో కర్ణాటకకు చెందిన వృద్ధుడు మృతి చెందిన ఘటన వెలుగు చూసింది. బుధవారం మధ్యాహ్నం స్థానికులు వృద్ధుడి మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రకాష్ గురవ్ (70)గా గుర్తించారు.కాగా.. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

దరఖాస్తు చేసుకోండి

బండి ఆత్మకూరు : మండలంలోని పలు గ్రామాల దేవాలయాల ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి నోటిఫికేషన్‌ను బుధవారం ఈఓ నాగప్రసాద్ విడుదల చేశారు. మండలంలోని కడమల కాలువ గ్రామంలోని శ్రీ శివనందీశ్వర స్వామి దేవస్థానం, నారాయణాపురంలోని శ్రీ నారాయణ ఆంజనేయ స్వామి ఆలయం, బి. కోడూరులోని చెన్నకేశవ స్వామి దేవాలయాలకు ధర్మకర్తల మండలి నియామకానికి ఆసక్తి కలవారు తొమ్మిది మందికి మించకుండా ఈ నెల 27వ తేదీ సాయంత్రం లోపు నంద్యాలలోని జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.